తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్
- రామన్‌పాడు, గోపల్‌దిన్నె రిజర్వాయర్ల పరిశీలన

మదనాపురం, ఏప్రిల్ 15 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ ఆదేశించారు. సోమవారం మండలంలోని రామన్ పాడు రిజర్వాయర్‌ను కలెక్టర్ తేజస్ నందలాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. రామన్‌పాడు జలాశయానికి ఎక్కడి నుంచి నీరు వస్తుందని సంబంధిత అధికారులను ఆరా తీయగా, జూరాల ప్రాజెక్టుతోపాటు కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి వరద నీరు వస్తుందని వివరించారు. ఇక్కడి నుంచి జిల్లా కేంద్రంతోపాటు చాలా గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే వ్యవసాయ బోరుబావుల ద్వారా నీటిని సేకరించి ప్రజలకు అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ అన్నారు. వచ్చే రెండు నెలల వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని, తాగునీటి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జూలై, ఆగస్టు వరకు తాగడానికి నీరు

వీపనగండ్ల, ఏప్రిల్ 15: గోపల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి వనపర్తి, గద్వాల జిల్లాలకు జూలై, ఆగస్టు వరకు తాగునీటిని నిరంతరం సరఫరా చేయవచ్చని పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నీటినిల్వ స్థితిగతులను పరిశీలించారు. జిల్లాలోని 392 హాబిటేషన్లు, 5 మున్సిపాలిటీలకు ఎలాంటి అంతరాయం లేకుండా నీటిసరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఈ చెన్నారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్ మోహన్, ఈఈ మేఘారెడ్డి, జెడ్పీ సీఈవో యాదయ్య, ఇన్‌చార్జి డీఆర్డీవో నాగేంద్ర, మిషన్ భగీరథ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే పరిష్కరించాలి

కొత్తకోట, ఏప్రిల్ 15: వేసవిలో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నీటి సరఫరాలో ఎక్కడైనా అవాంతరాలు ఉంటే పరిష్కరించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. సోమవారం కొత్తకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులతోపాటు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో తాగునీటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరాలో సమస్యలు గుర్తించి పరిష్కరించాలని, లేకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నీటి సరఫరాపై సరైన వివరాలు అందించకపోవడంతో డీపీవో రమణమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో మిషన్ భగీరథ ఎస్ఈ కృపాకర్‌రెడ్డి, డీఈ చెన్నారెడ్డి, ఎస్ఈ జగన్‌మోహన్, ఈఈ మేఘారెడ్డి, జెడ్పీసీఈవో యాదయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


రామన్‌పాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్

ప్రజల గుండెల్లో ఓడిపోలే..

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పట్టణ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 15: ఎన్నికల్లో ఓటమి, గెలుపులు సర్వసాధారణంగా ఉంటాయి, కానీ ప్రజల గుండెల్లో చీరస్థాయిగా ఉన్నానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉద్ఘాటించారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కార్యకర్తలకు మాజీ మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజలు మోసపూరిత హామీలు నమ్మి కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. నేడు వారి మోసపూరిత హామీలను గుర్తించి బాధపడుతున్నారన్నారు. వనపర్తి చరిత్రలో ఎవరూ చేయలేనంత అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. కానీ నేడు వాటిని కాపాడుకోలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి పార్లమెంట్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యతమనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, ఏప్రిల్15: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నికల మ్యానిఫెస్టోలోని ఆరుగ్యారెంటీలను పక్కాగా అమలుచేస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంతోపాటు మల్లాయిపల్లి, చింతకుంట, దొండాయిపల్లి, దవాజీపల్లి, అన్నారం తదితర గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడు గు, బలహీనవర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్‌నాయు డు, మాజీ జెడ్పీటీసీ రవి, సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్, ఎంపీటీసీ రమాదేవి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రామయాదవ్, బ్రహ్మం, బాలస్వామి, రామస్వామి, వెంకటయ్య యాదవ్, మహేశ్‌నాయుడు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిలో అధికారులు కీలకం

- వనపర్తి జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

చిన్నంబావి, ఏప్రిల్ 15: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులతోపాటు అధికారుల పాత్ర కీలకమని జెడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొందరు అధికారులు గ్రామాలాభివృద్ధికి బాటలు వేయాల్సింది పోయి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరికి అధికారం ఉంటే వారికి వత్తాసు పలుకుతూ పబ్బం గడుపుకుంటున్నారని.. అలాంటి వారిని గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలో ఎజ్జీవో సంస్థను ఏర్పాటు చేసి మండలంలోని మహిళలు, యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణను ఇచ్చే కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఐదేండ్ల నుంచి ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, రాజకీయాలు చేయడంలో ముందుంటున్నారని మండిపడ్డారు. సమావేశంలో జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, ఎంపీడీవో రమణారావు, ఎంపీవో రామస్వామి, పంచాయతీ కార్యకర్యులు, ఎంపీటీసీలు, వివిధ శాఖ ల అధికారులు ఉన్నారు.

తాగునీటి సమస్యలు రానీయొద్దు

- ఎంపీపీ కిచ్చారెడ్డి

తాగునీటి ఎద్దడిని నివారించాలి

వనపర్తి, ఏప్రిల్ 15: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీపీ కిచ్చారెడ్డి అధికారులను కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో రాఘవతో కలిసి ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే వాటిని అధికారుల దృష్టి తీసుకొచ్చి పరిష్కరించాలన్నారు. అలాగే ఉపాధి హామీలో కూలీల సంఖ్యను పెంచుకోవాలని, వారికి తాగునీరు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో సుదర్శన్, ఎంపీటీసీలు నాగరాజు, ధర్మానాయక్, కురుమూర్తి, మండల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

అమరచింత, ఏప్రిల్ 15: పట్టణంలోని ఆయా వార్డుల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడిని నివారించాలని మూడో వార్డు కౌన్సిలర్ విజయరాములు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నూరల్ నదీమ్‌ను కలిసి తాగునీటి ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పట్టణ ప్రజలకు ప్రతి రోజూ ఎంత తాగునీరు అవసరమవుతుంది? మున్సిపల్ అధికారులు ఎంత నీటిని సరఫరా చేస్తున్నారు వంటి వివరాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంటనే స్పందించి ప్రజలకు 2.80లక్షల లీటర్ల వరకు తాగునీరు అవసరం కాగా.. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా లక్షా70వేల లీటర్ల నీరు వస్తుండగా.. మిగిలిన నీటిని సోర్సు బోర్ల ద్వారా ట్యాంకర్లను పెట్టి సిబ్బందితో సరఫరా చేస్తున్నామని వివరించారు.

చోరీ కేసులో నలుగురు అరెస్టు

- రూ.3.50 లక్షల సొత్తు స్వాధీనం

పెబ్బేరు, ఏప్రిల్ 15: పెబ్బేరులో ఇటీవల అర్ధరాత్రి పూట మూసిఉన్న దుకాణాల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డ ఘటనలో నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3.50 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఈనెల 9న బస్టాండుకు సమీపంలోని నాలుగు దుకాణాల్లో నలుగురు దొంగతనానికి పాల్పడినట్లు చెప్పారు. ఏపీలోని కర్నూల్‌లోని ఆరోరానగర్‌కు చెందిన చందమాల శివతోపాటు మరో ముగ్గురు మైనర్లు రెండు స్కూటర్లపై వచ్చి చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. వారి నుంచి స్కూటర్లతోపాటు, దుకాణాల్లో చోరీ చేసిన 2 ల్యాప్‌ట్యాప్‌లు, 6 సెల్‌ఫోన్లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరు గద్వాలలో కూడా మూడు చోరీలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందన్నారు. నిందితుడు చందమాల శివను కోర్టులో హాజరుపర్చనున్నట్లు, మిగతా ముగ్గురు మైనర్ల విషయంలో నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెబ్బేరులో జరిగిన మార్కెట్ గోదాం అగ్నిప్రమాదం, మిగతా చోరీల కేసుల్లో దర్యాప్తు కొనసాగుతున్నదని సీఐ, ఎస్సై తెలిపారు.

రూ. 52 వేల నగదు పట్టివేత

గోపాల్‌పేట, ఏప్రిల్ 15: మండలంలోని బుద్ధారం గండి చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా లభించిన డబ్బులు పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన శివరత్నం కారులో వనపర్తి వెళ్తుండగా సోమవారం పోలీసులు అతడి కారును తనిఖీ చేశారు. కారులో రూ.52 వేల నగదు లభించగా సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సుబాబుల్ తోట దగ్ధం

వడ్డేపల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని బుడమోర్సు గ్రామానికి చెందిన రైతుల సుబాబుల్ తోటలు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రాజు, కోలా ఈశ్వర్, శేఖర్‌లకు చెందిన ఆరు ఎకరాల సుబాబుల్ తోటకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వగా వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాప్తి చెంది నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీరాముడిపై భక్తిభావం

- 35,516 బియ్యం గింజలపై 'శ్రీరామ' నామాలు

బియ్యం గింజలపై 'శ్రీరామ' నామాలు రాస్తున్న చక్రవర్తి ఆచారి

అయిజ, ఏప్రిల్ 15 : శ్రీరాముడిపై అపారమైన భక్తిభావాన్ని చాటుకున్నాడో.. భక్తుడు. బియ్యం గింజలపై 'శ్రీరామ' నామాలను రాసి పదేండ్లుగా భక్తిని చాటుతున్నాడు. అయిజ మున్సిపాలిటీలోని తుపత్రాలకు చెందిన చక్రవర్తి ఆచారి అర్చకుడిగా కొనసాగుతున్నాడు. ధ వారం గ్రామంలో జరిగే సీతారాముల కల్యాణానికి బ్యింపై శ్రీరామ నామాలు రాసి తలంబ్రాలలో కలుపుతున్నాడు. కేవలం 41 రోజుల్లోనే 35,516 బియ్యం గింజలపై రాశాడు. గతేడాది కూడా 21 రోజుల్లో 30,116 బియ్యం గింజలపై శ్రీరామ నామాలను రాశాడు.

'శ్రీరామ' నామాలు రాసిన బియ్యం గింజలు

చోరీ కేసుల్లో నిందితులు అరెస్ట్

- నగదుతోపాటు బంగారు నగలు స్వాధీనం
- దొంగలకు రిమాండ్: ఏఎస్పీ గుణశేఖర్

మాట్లాడుతున్న ఏఎస్పీ గుణశేఖర్

గద్వాల అర్బన్, ఏప్రిల్ 15: చోరీలకు పాల్పడిన వారిని పట్టుకున్నట్లు అదనపు ఎస్పీ గుణశేఖర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో చోరీలపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ క్రమంలో ఏఎస్పీ గుణశేఖర్ మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన జిల్లాకేంద్రంలోని లింగంబాగ్ కాలనీకి చెందిన రాజేశ్ తన కుటుంబ సభ్యులతో బెంగళూరుకు వెళ్లి తిరిగి 28వ తేదీన ఇంటికి చేరుకోగా.. తాళ్లం తెరిచి ఉన్న విషయాన్ని గమనించి గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల సహాయంతో పరిశీలించారు. 27వ తేదీన ఇద్దరు నిందితులు నెంబర్ లేని బైక్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అందులో భాగంగానే ఈనెల 13వ తేదీన జిల్లా కేంద్రంలో రెక్కీ నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనబడడంతో వారిని విచారించినట్లు పేర్కొన్నారు. ఏ1గా మాచర్ల శ్రీకాంత్, ఏ2గా మహమ్మద్ రఫీ కర్నూల్ జిల్లాకు చెందినవారుగా గుర్తించారు. వీరు రాత్రిళ్లు ఎవరూ లేని ఇండ్లను ఎంచుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు వివరించారు. వీరి దగ్గర నుంచి 10తులాల బంగారంతోపాటు రూ.4లక్షల నగదును రికవరీ చేసినట్లు తెలిపారు. ఇంకా 7తులాల బంగారం రికవరీ చేయాల్సి ఉందని, ఇంకా విచారణ జరగుతుందని వెల్లడించారు. వీరిపై కర్నూల్ జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

అలాగే గతనెల 13వ తేదీన గద్వాల మండలంలోని బీరెల్లికి చెందిన కృష్ణవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ ఈవెంట్‌హాల్‌లో పెండ్లికి వెళ్లారు. రాత్రి సమయంలో ఒక దొంగ చొరబడి బంగారు ఆభరణాల బ్యాగును అపహరించడంతోవారు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి సీసీ కెమెరాల సహకారంతో దొంగతనంపై ఆరా తీశారు. దొంగ ధరూర్ మండలంలోని నీలహళ్లికి చెందిన ప్రవీణ్‌గౌడ్‌గా గుర్తించమన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 27వ తేదీన హైదరాబాద్‌లోని అమీర్‌పేట పోలీసులు పట్టుకొని విచారించారు. పెండ్లిలో దొంగతనం చేసినట్లు ఒప్పుకోగా అతని దగ్గర నుంచి 20తులాల బంగారు నగలతోపాటు రూ.80వేలనగదును రికవరీ చేసినట్లు తెలిపారు. అనంతరం ముగ్గురిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీస్ అధికారులకు రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వనపర్తి పద్య కవులకు సన్మానం

వనపర్తి టౌన్, ఏప్రిల్ 15: తెలంగాణ పద్య సారస్వత పీఠం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన పద్య కవి సమ్మేళనంలో వనపర్తి కవులు సన్మానం పొందారు. పద్యానికి పూర్వ వైభవం తేవాలనే ఉద్దేశంలో ఏర్పాటైన తెలంగాణ పద్య సారస్వత పీఠం రాష్ట్ర అధ్యక్షుడు అవుసల భానుప్రకాశ్ ఆధ్వర్యంలో పద్యకవులతో శతకవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం ఆహ్వానం మేరకు వనపర్తి పట్టణానికి చెందిన పద్యకవులు బస్వోజు సుధాకరాచారి, నాయకంటి నర్సింహశర్మ, ఆకుల శివ రాజలింగం, చందాపురం బుచ్చయ్య, వీరాచారి, సువర్ణాదేవి, మల్లేశ్వర్, లక్ష్మయ్య ఉగాది-శ్రీరామ నవమి అంశాలపై పద్యాలను ఆలపించి పలువురితో ప్రశంసలు అందుకున్నారు. ఈ సమ్మేళనంలో రామాయణ భానువు పుస్తకావిష్కరణ అనంతరం ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సినీ నటుడు సీవీఎల్ నర్సింహారావు, పద్య సారస్వత పీఠం అధ్యక్షుడు అవుసల భానుప్రకాశ్, ఏఎస్ అకాడమీ చైర్మన్ రాఘవేంద్ర మరుమాముల దత్తాత్రేయశర్మ చేతులమీతుగా సన్మానం పొందారు.

హైదరాబాద్‌లో పద్య కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 15: ఎనిమిది నెలలుగా నిలిచిపోయిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే, కలెక్టర్లను జిల్లా ఐక్యవేదిక నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని పాత యూకో బ్యాంకు వద్ద నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులు ఎందుకు నిలిపివేశారని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమేనని.. ఆ తర్వాత అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరారు. వనపర్తిలో మాత్రం అన్ని పనులు నిలిపి రాజకీయాలు వెతుక్కుంటున్నారని విమర్శించారు. రోడ్డు పనులు ఎత్తుగా మరోవైపు గుంతులుగా నిర్మించడంతో సైకిళ్లు, వాహనదారులు కిందపడుతున్నారని, వెంటనే రోడ్డు వెడల్పు పనులు ప్రాంభించాలని, లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. పాత పనులకు ఎన్నికల కోడ్ అడ్డు రాదని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీశ్, సీపీఐ నాయకులు గోపాలకృష్ణ, ఎస్సీ మానిటరింగ్ సభ్యుడు నాగరాజు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌పాషా, దళిత సంఘం నాయకులు సుమన్, కాలనీ మహిళలు తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన

పాన్‌గల్, ఏప్రిల్ 15: మండలంలోని అన్నారం తండాలో మహిళా శిశుసంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఈజీఎస్ కూలీలకు బాలల హక్కులు, రక్షణచట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీయూ సోషల్ వర్కర్ నరేందర్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని తెలిపారు. అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నెంబర్లు 1098, 112, 181, 100ను సంప్రదించాలని కోరారు. అనంతరం కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈజీఎస్ కూలీలు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

అయిజ, ఏప్రిల్ 15 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జై నడిగడ్డ యువత సభ్యులు సోమవారం పట్టణంలోని పీహెచ్‌సీలో కేక్ కట్ చేసి, బాలింతలు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జై నడిగడ్డ యువత జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ, వీరేశ్, తస్యం, మలికార్జున్, అశోక్‌గౌడ్, మద్దిలేటి, వీరేశ్, ఆంజనేయులు, శివన్న, మహేందర్, అనిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ చైర్మన్

పెద్దమందడి, ఏప్రిల్ 15: వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిని సోమవారం మండలంలోని మంగంపల్లిలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేశ్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ కలిశారు. వనపర్తి మున్సిపల్ పరిధిలో రోడ్ల విస్తరణ పనులు, ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర పనులపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు చైర్మన్ తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు వారు చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కౌన్సిలర్లు వెంకటేశ్, సమన్వయకర్త సతీశ్ తదితరులు ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం

వివరాలను వెల్లడిస్తున్న పట్టణాధ్యక్షుడు రమేశ్‌గౌడ్

వనపర్తి, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం వనపర్తి నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ తెలిపారు. సోమవారం పార్టీ పట్టణ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ప్రచార వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మొదటగా.. ఖిల్లా ఘణపురంలో ఉదయం 10గంటలకు పాల్గొని అనంతరం మండల సమావేశంలో పాల్గొంటారన్నారు. పట్టణంలో సాయంత్రం 4గంటలకు హరిజనవాడ, కాశీంనగర్ చౌర స్తా, సాయంత్రం 6గంటలకు రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసే కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, జిల్లా ఎస్టీ నాయకుడు జాత్రునాయక్, ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి, కౌన్సిలర్లు కంచెరవి, జోహెబ్, పా షా, రాంచందర్, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ మండల సమావేశం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందని, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 15: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రాజేశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అల్లమాయిపల్లిలో ఉపాధి కూలీలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు లేని అర్బన్ పిల్లలు చదువుకోవడానికి స్పాన్సర్‌షిప్ పథకం కింద అందించే విధానం, యువతపై మాదకద్రవ్యాల ప్రభావం, సైబర్ నేరాలు, వేసవిలో బాలల సంరక్షణకు సంబంధించిన అంశాలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అందిస్తున్న సేవలకు అత్యవసర చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 112, 100కు ఫోన్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఆశోక్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహ, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు ఉన్నారు.

ఆలయ స్థలం కబ్జా కాకుండా చూడాలి

అమరచిం